# మానవ సేవ

శ్రీ రామచంద్రజీ మహారాజ్ గారి సాధనావిధానము రాజయోగమును అనుసరించియున్నదని ప్రముఖముగా తెలిసిన విషయము. కొంతమంది సన్యాసులు, గృహస్థ జీవితమును త్యజించిన మరికొంతమంది దివ్యత్వమును పొందుటకు యోగమార్గము వారికి మాత్రమే పరిమితమైనదిగా భావించియుండుటవలన, వారు అనుసరించిన పద్ధతిని శ్రీ రామచంద్రజీ మహారాజ్ గారు సమూలముగా మార్పుచేసి సాధారణ మానవుని గృహస్థజీవితమునకు అనుకూలముగా మలచి రాజయోగమును సాధనావిధానములో ప్రవేశ పెట్టి ఆచరణయోగ్యమైన స్థితికి తీసికొనిరావడమైనది. ఇది సాధారణమైన విషయము కాదు. ఎందుకంటే గత రెండువేల సంవత్సరములనుండి సన్యాసులు యోగము అని పైకి పిలువబడు ప్రత్యేకమైన పద్ధతులను ఆచరించుచు, ఈ విశ్వమంతటికి కారకుడైన దైవమునకు మానవునకు లేదా అతని ఆత్మకు యేవిధమైన సంబంధము లేకుండా చేసినారు.

సన్యాసము మరియు వాటి విలువలు, అటువంటి ఆలోచనా సరళిగలవారికి చాలా అవసరమనిపించవచ్చును. కాని వేదకాలములోని గొప్ప మేధావులు కొందరు, యిటీవల కాలములోనివారు, ప్రపంచమును త్యజించిన సన్యాసుల బోధనలు చాలా పొరబాటని కనుగొనిరి. ఎందువలననగా మొదటగా ఈ విధానములో దైవముచే సృష్టింపబడిన ఈ ప్రపంచము అర్థరహితమని భావించి దానిని నిరాకరించుట. దైవము తాను చేయునది పూర్తిగా తెలిసి చేయునను విషయమును నిరాకరించుట. ఈ మాయా ప్రపంచ సృష్టికర్త దైవమే యని నిరాకరించుట. మానవజీవితము అనేకమైన బాధలమయమని అందువలన ఈ జీవితమునే త్యజించవలెనని చెబుతారు. ఈ విధమైన జీవితమునకు అలవాటుపడిన మనము, సత్‌తత్వప్రాప్తికి ఈ జీవితమునుండి పారిపోవలెనను అభిప్రాయము కలిగివుందుము. దీని ఫలితము మీకందరికి తెలియును. యోగము గృహస్థులు మరియు గృహిణులు తమ వల్లకాదను అభిప్రాయము కలిగివున్నారు. ఏ వ్యక్తి అయినను యోగసాధనచేయు సంకల్పము చేసినచో అతనిపై వారి కుటుంబసభ్యులు మరియు సమాజము సందేహాస్పదమైన దృష్టి కలిగి యుందురు.

గత శతాబ్దకాలములో వైరాగ్యము మరియు ధ్యానమను రెండు సిద్ధాంతములపై కేంద్రీకృతమైన వేదాంత సాధనను కొంతమంది సాధకులు, వారి అవగాహన యేమైనప్పటికీ, వ్యతిరేకించుచున్నారు. గత శతాబ్దమున్నర కాలములోను భారతీయ సంస్కర్తలు వేదాంతములో, జీవితమును, వాటి విలువలను త్యజించుట దిద్దుబాటు చేయవలసియున్నదని కోరుతున్నారు. వేదాంతము మరియు సన్యాసము స్వీకరించుట అను విషయములపై నిరసన

వ్య క్తీకరించబడుచున్నదనునది నిస్సందేహము. అందువలన వేదాంతపరమైన జీవన విధానమును నిరసించు అనేక సంస్థలు, గ్రంథములు మనకు కలవు. ఈ ప్రపంచమే మాయ, మోక్షమును కోరు సాధకులు ఈ ప్రాపంచిక విలువలను పూర్తిగా త్యజించవలెను అని చాటించుటకు ప్రయత్నము చేయునట్టి వేదాంతమును గురించి నేను చెబుతున్నాను.

ఈ విధమైన పరిస్థితులలో, పైన ఉదహరించిన వొక ప్రత్యేకమైన కోవకు చెందిన వారు బోధించి, ప్రచారము చేసిన వేదాంతములతో నైతిక, వ్యవహారికముగా మన జీవితములలో ఓడిపోయినామని తెలుసుకొనినపుడు, ఈ ప్రపంచమును అంగీకరించు వేదాంతము మనకు కావలెను కాని దీనిని త్యజించునది కాదని మనకు స్పష్టమగును. దైవసృష్టియైన ఈ ప్రపంచములో ఆనందమును అనుభవించి దీనితో అనుసంధానము చేయు ఆధ్యాత్మిక పద్ధతిని మనము కోరుకొనెదము కాని బాధలతో సహవాసము కోరము. అనేక ఉద్యమాలలోని ఉద్దేశ్యములను గమనించినపుడు రామమోహన రాయ్, కేశబ్ చంద్రసేన్, టాగూర్, శ్రీ అరబిందోలు; ఈ ప్రపంచమును త్యజించమని బోధించిన రామకృష్ణ, వివేకానందుల బోధనల కంటే ప్రపంచమునకు అనుకూలముగా జీవించుట ముఖ్యమని బోధించినారు.

ప్రస్తుత ప్రపంచములోని ప్రాపంచిక విలువలను ప్రక్షాళనచేసి దివ్యముగా చేయవలసిన సమయములో మనకు అనంతముతో నేరుగా సంబంధము కలుగజేయు పద్ధతిని మనము ప్రయత్నించవలెనను స్పష్టమైన అవగాహన కలుగును. ఈ సందర్భములో నేను ఒక విషయము చెప్పగలను. అనేక అధ్యయనములు చేసిన సంస్కర్తలు, వారు సామ్యవాదులు కానీయండి లేదా తీవ్ర వాదులు కానీయండి, లేదా ఈ ప్రపంచమును పూర్తిగా త్యజించమని చెప్పినవారు కానీయండి లేదా దీనిని సమర్థించిన వారు కానీయండి వారందరు మానవుడు అతిముఖ్యమైనవాడని, మరియు దైవమును తెలుసుకొని సేవించుటకంటెను మానవసేవ అతి ఉత్తమమైనదని భావించినారు అనునది వాస్తవము. ఇది దేనికి దారితీయునో మనకు తెలుసు. దివ్యత్వమును ప్రాప్తి చేసుకొనుటకు మానవ సేవచేసిన చాలునని భావించువారు అనేకమంది కలరు. ఒకసారి ప్రతి మనిషిలోను దైవమును చూచుటకు యత్నించినపుడు, అందరిలోను దైవమును చూచుట అలవరచుకొని, వారిలోని దైవమును సేవించుకొనిన చాలునని భావింతురు. తాత్వికముగా యిది బాగుగా అనిపించును. కాని ఆచరణలోకి వచ్చినపుడు, ప్రతి వ్య క్తి ఆత్మకు యేవిధమైన సేవ అందించవలెననునది మనకు తెలియదు. మానవజాతికి మనముచేయు సేవలో యేవిధమైన న్యాయమున్నదో, మనకున్న అనేక సిద్ధాంతములు, విధానములు మరియు అనర్గళముగా సాగిపోవు వేదాంత గ్రంథములు మానవునిలోని చైతన్యమును ఉన్నతముగా తీర్చిదిద్ది, వానిలో విశ్వమానవ విలువలు ఏమాత్రము పెంపొందించినవో నాకు తెలియదు కాని

మనిషి సంపూర్ణుడు కాలేదు. ఇప్పుడున్న పరిస్థితులలో అతను యింకను ఆత్మస్వరూపుడుగ మారలేదు. అతను ఆత్మస్వరూపుడుగా అతనే దైవమునకు ఆలయముగా మార్పుచెందవలెను. వీధిలోని శిల తనలో దైవశక్తిని కలిగియున్నది కావున నేను వీధిలోని ప్రతి రాయిని పూజిస్తాను, దానిముందు మోకరిల్లుతాను అనునది హేతుబద్ధమైనది కాదు. మీకు దేవాలయములోని విగ్రహములను ఆరాధించవలెనను అభిరుచి వున్నచో, దానిని పవిత్రము చేసి, ప్రాణప్రతిష్ఠ చేయు పద్ధతికలదు. అదేవిధముగా మనిషినికూడా పవిత్రుని చేయకుండా ఆతనిని పూజించలేరు. మానవుని పరిశుద్ధుని చేయు పద్ధతి ఏమిటి? నిమ్న స్థితిలోని మానవుని దేవునిగా భావించినపుడే మతములలోని ఉద్దేశ్యమును విడిచినామని నేను అనుకొంటాను. మనిషిని దైవస్వరూపునిగా మార్పుచేయు విధానమును యింకను మనము అభివృద్ధి పరచవలసి యున్నది. ప్రతివ్యక్తి దివ్యత్వమును సంతరించుకొని దైవస్వరూపునిగా మార్పుచెందు అవకాశమును కలుగజేయవలెను. వైద్యశాలలోని మానవులను, గోశాలలోని గోవులను, వీధులలో తిరుగాడు జంతువులను లేదా కుష్ఠురోగులను సేవించినచో యిది ఏవిధముగా సాధ్యపడునో నాకు తెలియదు. దేనిని ప్రచారము చేయుటకు మనము యత్నించుచున్నామో నేను తెలుసుకొనవలెను. నేను దయలేనివాడనని దీని అర్థము కాదు. మీరుకూడా దయా గుణములేని వారు కమ్మని నేను కోరుకొనుటలేదు. మీరు దయాగుణము కలిగివుండవలెననే నేను కోరుకుంటున్నాను.

ప్రతి ఒక్కరిని ఉన్నతమైన మార్గములోనికి తీసుకొనిపోవలెను. ప్రతివ్యక్తికి లేదా ఈ విశ్వములోని ప్రతి అణువుకు యివ్వగలిగిన శక్తి దానిని దివ్యత్వముగా మలుచుటకే యీయబడినది. మీరు చేయు సేవ వలన మీ అర్థములేని ప్రేమ వలన, దీనిని నీవు సాధించితివా? బహుశా మీరు చేయు సేవ వలన వారిలో ఆత్మన్యూనత కలిగి వారిని వారుగానే వుంచుననునది మీకు ఎంతవరకు రుచించినదో నాకు తెలియదు.

మీరు చేయు సేవ ఆవిధముగా భావించినపుడు, యోగాభ్యాసము దుర్బలులకు సరిపోదు. యోగ దివ్యత్వమును కలుగజేసి, వారియొక్క వారసత్వపు విలువలకు అనుగుణముగా దివ్యత్వములోనికి వికసించవలెను. దీనికి తగిన విధానమేది? మృగతుల్యుడు, దుర్బలత్వముతో నిర్వీర్యుడైన మానవుని ఉత్తేజపరచి దివ్యత్వస్థితులకు కొనిపోయి, ప్రశాంతత, సామరస్యత చేకూరి పరిపూర్ణమైన మహాత్మునిగా మార్పుచెందుటకు తగిన పద్ధతి యేది? ఏదో ఒక సుగుణమున్న ప్రతివాడు మహాత్ముడు కాలేడు. అన్ని సుగుణములు కలిగినవానినే మహాత్మునిగా సంబోధించవచ్చును. ప్రతివానికి యిచ్చు అనేకమైన బిరుదులను విమర్శించు ఉద్దేశ్యము నాకు లేదు. మానవ లక్షణములను ఉన్నత స్థితులకు కొనిపోవుటకు తగిన

అవకాశములను యింకను మనము అభివృద్ధిపరచవలసి యున్నది. దివ్యత్వము లేదా అనంతత్వమును పొందుటకు జీవితాంతము యోగసాధన చేయవలెను. ఈ జీవితమంతయు యోగమే అని, నీవు జీవితాంతము యోగసాధన చేయవలెనని, విశిష్టమైన వ్యక్తులలో ఒకరిచేత గుర్తింపబడినది. ఈ అభిప్రాయము శ్రీ అరబిందో వ్యక్తపరచినారు. వారు ఈ శతాబ్దము మొదటిలోనే యోచించదగిన సత్యమును బోధించినారని నిస్సందేహముగా నేను చెప్పగలను.

కాని వారి తత్వము, మరియు యోగసాధనలో మనకు వాగ్దానము చేసినంత లబ్ధి మనము పొందలేదని నా భావన. దీనికి మొట్టమొదటి కారణమేమనగా వారు అనంతతత్వముకంటె నిమ్న స్థితియే ముఖ్యమైనదని మరియు అనంతతత్వము మనలోని ప్రతివాని జీవితములో పాలుపంచుకొనిన, ఆతని జీవమునే పూర్తిగా నాశనము చేయునని భావించినారు. ఈ అనంతత్వము కంటే తక్కువస్థితిని వారు అధిమనస్సు (Supermind) అని సంబోధించినారు. ఇదియే బాగుగా పనిచేయునని చెప్పుటయేకాక దివ్యమానవ వికాసములో క్రమముగా అభివృద్ధిని చూపునని వారు భావించినారు. వారి ఆశావాదము నిరూపణ అయినదని నాకు నమ్మకములేదు. అది యింకను నిరూపించవలసియున్నదని నేను భావించుటకు అనేక కారణములు కలవు.

నా ప్రక్కన ఆశీనులైన శ్రీ రామచంద్ర మిషన్ వ్యయస్థాపకులు, వాస్తవముగా అనంతత్వ శక్తియే మన జీవముయొక్క అనంతత్వమును పొందుటకు దారిచూపగలదని మనకు చూపించినారు. అంతకన్న తక్కువ శక్తి అసంపూర్ణమైన ఫలితములనే కలుగజేసి వేదకాలమునాటి మహర్షులు మనలో ఆశించినమేరకు మార్పు కలుగజేయక మనలను అనంతత్వమునకు ఆవలనే వుంచును. ఆ మహర్షి (శ్రీ అరబిందో) వేదములను పారాయణచేసినప్పటికి అనంతత్వమును పూర్తిగా అవగాహన చేసుకొనలేదని నా భావన. ఇప్పుడు నాస్వానుభవమును మీముందు వుంచెదను. మనము యోగముతోనే మొదలుపెట్టవలెను. ఈ విషయములో నేను చేయుచున్న ప్రయత్నములు, దివ్యశక్తిగలది, లక్ష్యమును తప్పక చేర్చునది, సులువుగా సాధనచేయగలిగినది, నిస్సందేహముగా మిగిలిన వాటికన్న మనలను ఉన్నతస్థితులకు కొనిపోవు యోగముతోనే సాధన మొదలు పెట్టవలెనని బోధించిన మహానుభావుని పాదములచెంతకు చేర్చినవి. అందువలననే వారు "దివ్యత్వముతో కలిసిన చైతన్యమునకు సూచిక ఏమిటని" ప్రశ్నించిరి. మనలోని ప్రశాంత చిత్తము దీనికి మొదటి సూచికగా నేను నమ్మకముగా చెప్పగలను. ప్రశాంత చిత్తము పొందుట చాలా కష్టమని చెప్పబడినది. కాని ప్రశాంత చిత్తము అనేది మనలో చాలామందికి అనుభవములోనికి వచ్చినదే. సాధనలో మొదటిసారిగా ఈ పద్ధతిలోనికి పరిచయము చేయబడు సాధకునకు కూడా ఈ అనుభవము కలుగును. ఆ తరువాత నిశ్చలము,

విశాలము మరియు వికాసవంతమైన మానసికస్థితి పనిచేయుట ప్రారంభమగును. అనేకమైన విరుద్ధ భావములతో సతమతమగు మానవ మనస్సు యిక యేమాత్రము వుండదు. వాస్తవముగా యోగ సూత్రములలో ప్రథమమైన "యోగ చిత్తవృత్తి నిరోధః" ఆదిలోనే సంభవమగును. ఇది పతంజలి యోగసూత్రములలో ప్రథమము! దీనివలన తెలియునదేమనగా నీలో యోగసాధన కలిగినపుడు ప్రప్రథమముగా ప్రశాంత చిత్తము కలుగును. ఇది అపస్మారకస్థితిలోని లేదా పూర్తి స్మారక స్థితిలోని మనస్సు కాదని దయచేసి గమనించండి. ఇవి రెండూ కాదు. ఈ రెండింటికి అతీతమైన మానసికస్థితి కలుగును. ఒక ప్రత్యేకమైన మానసిక చైతన్యము మనలో పనిచేయుట ఆరంభించును. మనలోని కొంతమంది సాధించినది నేను ఒక్క ముక్కలో చెప్పాలంటే, మన మనస్సులు యితర వ్యక్తుల మనస్సులకంటె భిన్న మైనవని, యింకా మనము విభిన్న మైన తెగకు చెందిన వ్యక్తులము. కాని అటువంటి ప్రత్యేకతను నేను ఆశించుటలేదు. పూజ్య శ్రీ రామచంద్రజీ మహారాజ్ మనకు అందించిన విధానములో యిచ్చిన దీక్షవలన, దివ్య సంకల్పము యొక్క ప్రాణాహుతి ప్రసారమువలన, మనస్సు దివ్యత్వమును పొంది, ఆ దివ్యశక్తితో, ఆ దివ్య ప్రకాశముతో ఎదిగి, యోగసాధనలో యదార్థ మైన యాత్రను ప్రారంభించినామని నేను చెప్పగలను.

ఇప్పుడు యిక్కడ చేయు మానవసేవ చాలా భిన్న మైనది. ఇటువంటి మనస్సును బాధలలోనున్న (శారీరక బాధకన్న మానసిక బాధ కష్టతరమైనది లేదా నైట్జ్ఛీ చెప్పిన విధముగా, మానసికముగాకంటె శారీరకముగా బాధపడుట మేలు) ఏ వ్య క్తియొక్క చైతన్యములోనికైనను ప్రవేశపెట్టి, అతని మనస్సుకు ఉపశమనము కలిగించగలిగిన, దానిపైననే దాని దృష్టికలిగి భయంకరమైన స్థితిలోని నిర్భయమైన జీవితమును అభివృద్ధి చేయుటకు ప్రయత్నము చేసిన, అప్పుడు నిజమైన ఆధ్యాత్మికతలో అపూర్వ మైన మార్పు ఆరంభ మైనదని నీవు కనుగొనగలవు. ఈ నూతనమైన చైతన్యమును ప్రవేశపెట్టుటవలననే ఆధ్యాత్మికమైన మార్పు ప్రారంభ మైనది. మూలమునకు యిది భిన్న మైనది కాదు. ఎందువలననగా ఆదిచైతన్యము లేదా దివ్య చైతన్యము అధోముఖముగా అనేక స్థితులనుండి క్రిందికి ప్రవహించుటవలన, భౌతిక తత్వముగా మార్పుచెందినది మరియు నిస్సందేహముగా తన భయములో తానే చిక్కుకొన్న పరిశుద్ధ చైతన్యము (a consciousness that is in holy fear of itself). మనిషి చైతన్య రహితుడుగా ఎందుకు అవుతాడు? మీరు ఈ ప్రశ్నవేసుకున్నారా? ఎందువలన అతడు చైతన్యములోనుండుటకు భయపడతాడు? ఈ ప్రపంచములో అనేకమంది వారి చైతన్యమునకు భయపడి మాదకద్రవ్యములు, నిద్రమాత్రలు వాడెదరనుటలో ఆశ్చర్యములేదు. జీవితాంతము యిటువంటి మానసిక శక్తులను పెంచిపోషించుచున్న మానవులకు సేవచేయవలెనని మీరెపుడైనా దృష్టి సారించినారా? ఈ విధముగా మానవజాతి వుండాలని

మన ఆకాంక్ష కాదు. మానవాళి గురించి నాకు ఒక గొప్ప ఆదర్శమున్నది. మానవుడు దివ్యత్వముగా మారు ప్రత్యేకమైన శక్తి కలవాడని నేను భావించెదను. ప్రతివ్యక్తి కూడా తనను తాను ఒక భగవంతునియొక్క దేవాలయముగా మలుచుకొనగలడని నేను చెప్పగలను. నేను 'దేవాలయము' అని సంబోధించను. ఎందువలననగా యాంత్రికపరమైన ఈ జీవితమును నేను ఏవగించుకుంటాను. అతను దివ్యత్వముతో సంచరించుచు, దానిలోనే జీవించుచు, అదే అతని జీవము మరియు ఊపిరియై, దాని దేహముగా మారగలడని నేను చెబుతాను. ఒక విగ్రహము లేదా ప్రతిమవలె, దేవాలయముకూడా నా దృష్టిలో భౌతికమైనదే. అంతకన్న ప్రతిభావంతమై, ఎల్లడెల ఐకమత్యము, ఆనందము వెదజల్లుతుండవలెనని యిష్టపడతాను. ఎల్లడెలా జీవనసారమును అనుభవించవలెను. శిలలు కూడా ఉన్నతగతికి చెందిన జీవముతో నాట్యము చేయుట వీక్షించుటకు నేను యిష్టపడతాను. నైపుణ్యముగల శిల్పిచేతులలో యిది సంభవము.

ఇది దివ్యశక్తికి తప్ప యింక యే శక్తికి సాధ్యమగును? దివ్యత్వమును క్రిందకు తీసుకొని వచ్చుటకు భగీరథ ప్రయత్నమవసరమని వారు వ్యక్తపరచినారు. ఈ కథ మీరందరు తప్పక వినివుంటారు. అనేక సంవత్సరములు భగీరథుడు కఠోరమైన తపస్సు చేసి దివినుండి గంగను భువికి తెచ్చినాడు. కలియుగములో భగవన్నామము స్మరించినచో విముక్తి కలుగునని చెబుతారు. ఈ వాక్యములోని రెండవ భాగములో కొంత నిజముందని నేను భావిస్తాను. కాని మీరు వినాలని భావిస్తున్న దైవము యొక్క పదము ఏమిటి? ఏ దైవశ్వాస మీకు శాశ్వతత్వము కలుగజేయును? మీకు సులభముగా అందుబాటులోనున్నదేది? మీరు సులభముగా పొందగలిగినది, అతి సులభముగ అనుభవించగలిగినది, పొందిన పిదప అది ఎప్పటికి మిమ్ములను వదలనిది లేదా మీరు వదలనిది యే మహానుభావుడు మనకు అందించినాడు?

అట్టి యోగ్యత, మరియు అనంతమైన కీర్తి ప్రతిష్ఠలు శ్రీ రామచంద్రజీ వారికే చెందవలెనని నేను భావించుచున్నాను. వారు అతి సులభము, సూటియైన, డంబములేని విధములో దివ్యత్వముతో కూడిన తేజస్సు లేదా ఆ తేలికతనమును మనకు యివ్వగలిగినారు. దీనివలన ప్రతి ఒక్కరి హృదయములోను నూతనోత్సాహము, నూతనమైన తేజస్సు చేకూరును. ఇది నాకు అనుభవములోనికి వచ్చినది. నేను దీనియందు ఆసక్తి మరియు శ్రద్ధగల వారితో పంచుకున్నాను. ఇవి ఉత్తి మాటలు కావని, వారు కోరినచో దీనిని వాస్తవముగా అనుభవించగలరని వారికి తెలియును. ఇంత సులభముగా దివ్యత్వము మన దగ్గరకు వచ్చుట, సత్‌తత్వము చాలా సులభమైనదనియు, వేదాంతులు దానిని గందరగోళము చేసి బహు కష్టతరము చేసినారని మనకు విశదమగుచున్నది. "ఏకమ్‌సత్ విప్రాః బహుదా వదంతి" - ఈ విప్రులనగా వేదాంతులు. ఒకే దానికి అనేకమైన నామములతో నిఘంటువులను నింపిన ఎంతో విజ్ఞానధనులు.

అతిశయముతో కూడిన వారి విజ్ఞానము మితిమీరి, అనువాదములను అపార్థము చేసుకొనిరి. ఈ విధముగా సున్నితమైన సత్‌తత్వముతో కూడిన హృదయము లేకుండా ఆడంబరములతో కూడిన దానిని అభ్యసించినారు. ఈ ప్రపంచములో ఎక్కువగా భ్రమింపచేయువాడు, మాటలతో గారడీ చేయు వ్యక్తి తప్ప వేరెవరు?

ఇపుడు మనము సత్‌తత్వముతో సంబంధము కలిగి యున్నాము. ఈ సాయంత్రముకూడా నా స్నేహితులలో ఒకరు గురుదేవులను ఉపన్యసించమని కోరినారు. తప్పకుండా, నా ప్రక్కన ఆసీనులైన వేదాంతికి నేను యిచ్చినానని వారు చెప్పినారు. నన్ను నేను చిన్నబుచ్చుకొనుటకు నేను కొద్ది స్వేచ్ఛను తీసుకొను చున్నానని నా ఉద్దేశ్యము. సత్‌తత్వము మాటలకు అతీతమైన అతి సున్నితమైనదనియు, ప్రేమతో పనిచేయుట లేదా తననుతాను అర్పించుకొనుటయే ప్రేమకు అర్థము అని నేను చెప్పెదను. అనగా మానవుడు తిరిగి దైవత్వము పొందుటకు తన పూర్తి జీవితమును మరియు జీవశ్వాసను అర్పించుట. ఇది జరిగినపుడు, ఇంతకంటె మహిమను నీవు యేమి కోరెదవు? వారు చేయు ఈ సేవకంటె మిన్నయైన సేవ మీరు కోరుకొనునది యేమి వున్నది? నేను మీకు సేవచేయగలనా? అని పూజ్య శ్రీ రామచంద్రజీ ఎల్లపుడు అడుగుతుంటారు. ఆవిధముగా వారు మాట్లాడెదరు. మనలోని నిజతత్వమునకు యేదైతే వృద్ధిచెందగలదో, యేదైతే మనకు శాంతిని ప్రసాదించునో, యేదైతే మన జీవనమునకు అవసరమో దానికి, మరియు మనలో ఒకే వ్యక్తికికాక, మనందరికి తననుతాను నిరంతరము అర్పణ చేసుకొను విధానము. గురుదేవులు నన్ను ఒక్కడినే ఎంచుకొనినారని చెప్పలేను. ఈ ప్రపంచములో ఆయనను కోరుకొనిన ప్రతిఒక్కరిని వారు కోరుకొన్నారు. మనలోని అభిలాషనుబట్టి వారుచేయు సహాయము వుండునే తప్ప యేవిధమైన పక్షపాతము లేదా ఆచార్యాధిపత్యము లేదు. ఇది అర్థము చేసుకున్నచో, ఎవ్వరైనను, ఎప్పుడైనను వారిని పరీక్షించవచ్చును. ఇచట జీవము వున్నది. అదియే యోగము. అది ఆయన నీతో ఏర్పరచుకొను అనుసంధానము. అనంతముతో మనము అనుసంధానము ఏర్పరుచుకొనుట చాలా కష్టము. కాని అనంతము మనతో అనుసంధానము చేసుకొనుట చాలా సులువు. అందువలననే వారు, యోగము మనము ప్రేమించు దైవముతో మొదలిడును కాని మనతోకాదు. మనని ప్రేమించేది ఎవరు? దైవమే నిన్ను ప్రేమించును కాని నీవు కాదు అని చెబుతారు. "అన్‌బేశివమ్" అని చెబుతారు. వారు యే అర్థముతో ఆమాట అంటారో నాకు తెలియదు కాని నాదృష్టిలో దాని అర్థము యిదే. మిమ్ములను పరిశుద్ధులను చేసి, పవిత్రముచేసి, దివ్యత్వముచేసి, మీవూపిరిలో వూపిరిగా జీవితములో జీవముగా, ఎల్లకాలములందు మీతో వుండునది యిదే నిజమైన యోగము, నిజమైన కలయిక అని నేను భావించెదను. ఆయనను ఎల్లవేళలా మీలో దర్శించుచు, స్వస్వరూపజ్ఞానము ప్రాప్తించి, మీజీవన భారమంతయు

భరించునది, ఈ మహోన్నత వ్యక్తి మనందరకు చేసిన మరియు చేయుచున్న అతి ముఖ్యమైన సేవ యిదియేనని నేను భావించెదను. ఆయన చాలా నిరాడంబరుడు అని చెప్పుటలో నాకు సందేహము లేదు. ఆయనను చేరలేరని ఎవ్వరు చెప్పలేరు. వారు ఏకాంతవాసంలో బంధింపబడి లేదు. ఆయన చేతలలోనే చూపించుటకు యిష్టపడెదరు కాని మాటలలో కాదు. అతిగా మాట్లాడు వారు ఏమీ చేయరు! దీనిని యింత పరిపూర్ణముగా ఎందుకు సాధన చేసినారో నాకు తెలియదు. ఏమైనప్పటికి, వారిని బహిరంగ సమావేశములోకాక, ఏకాంతముగా కలిసినపుడు అందరిలాగే వారుకూడా మాట్లాడెదరు.

అందువలన నేను ప్రారంభించిన మానవసేవ అను విషయముతో గోచరించునదేమనగా, మానవజాతి ప్రస్తుతము వున్న మానసిక దుర్బలత్వమునుండి బయట పడుటయేకాక రాబోవు చెడు మార్గములనుండి అతనిని తప్పించు అతి పెద్ద సహాయమును మనము చేయగలము. మన దేశములో పునర్జన్మ అనునది మనకు జరగరానిదని మనము నమ్మెదమని మీకు తెలుసునా! అది చెడు అనికాదు కాని మనకు తిరిగి ఎటువంటి జన్మ వచ్చునో తెలియదు. పునర్జన్మ అన్నచో భయపడుటకు యిదియే కారణము. కాని యిప్పుడు అన్నీ తప్పుడు పనులు చేయుచు, వారి రాబోవు జన్మగురించి మంచి ఆశలతో ఖచ్చితమైన అభిప్రాయములు కలవారు మనలో చాలామంది కలరు. వీటిలో దేనినీ మీరు అనుసరించుట నాకు యిష్టములేదు. మనకొక భవిష్యత్తు కలదని నేను నమ్ముతాను. రాబోవు జన్మ అని నేను చెప్పను. ఒకవేళ పునర్జన్మ కలిగినను యిదేస్థితిలో కలగాలని లేదు. దీనికి అతీతముగా పురోభివృద్ధి చెంది, ఈ భౌతిక చైతన్య పరిధులకు తిరిగి రాకుండా, పరమాత్మలోని పరమాత్మగా వున్న దివ్యత్వమువైపు (as He is in Himself); సాగిపోవలెను. ఎందువలననగా గురుదేవులు మనకు యిక్కడ వున్నవిధముగా, ఈ యోగములో దివ్యత్వమే యున్నది. అది మనకు దేవునిలోని దేవుని తెలుసుకొనుటకు తగిన కుతూహలము మరియు ప్రోత్సాహమును యివ్వవలెను. దివ్యత్వమే మనవద్దకు వచ్చినది. వారు ఎంతో దయతో మనకు మానసిక ప్రశాంతతను కలిగించెదరు. వారు మనలను విశ్వ చైతన్యము లేదా విశ్వ అచేతనత్వము, అదియేదైనను దానితో అనుసంధానించినారు.

దైవములోని దైవము (He is in Himself) అనగానేమి? ఈ సరళమైన ప్రశ్న ఎవరిలోనైనా ఉదయించినదా? ఆయనలోని దైవమేమి? మనకు దైవమంటే ఏమిటో మరియు దైవము ఏవిధముగా మనకువుండాలో మనందరము మాట్లాడెదము. దైవములోని దైవము లేదా ఆయనకు ఆయన ఏమిటని మనలను మనము ఎన్నడైనను ప్రశ్నించుకొనినామా? ఇదియే ఒక ఉన్నతదిశగా పురోభివృద్ధి చెందు మార్గము ఈ శరీరము వదిలిన తరువాత లేదా నీవు ఈ శరీరములో జీవించి వున్నపుడే, ఈ జిజ్ఞాస లేదా పరమాత్మలోని పరమాత్మగా భగవంతుని

తెలుసుకొనవలెనను అభిలాష కలిగినచో, మనము పరతత్వము చేరుకొనువరకు ఉన్నతమైన చైతన్యస్థితులకు దారి చూపించును. పరమాత్మలోని పరమాత్మ యైన దైవమును చేరుకొను జిజ్ఞాస కలిగియుండవలెనే కాని, దైవముయొక్క చిట్టచివరి పరిణామదశయైన మానవజన్మ వైపు మాత్రము కాదు.

ఈ విషయములో శ్రీ రామచంద్రజీ, మానవ జీవితములో దాని పరిధులను దాటి ఎదిగినపుడు, తిరిగి ఈ భువిపైకి రావలసిన అవసరము లేదని, చాలా స్పష్టముగా తెలిపెదరు. మనిషి చనిపోయిన తరువాత మృగముగా జన్మించునా లేక జన్మించ గలడా అను విషయముపై అనేక అభిప్రాయములు కలవు. ఇదంతా మనిషికి జంతువు లేదా యితర ప్రాణులపై వున్న ప్రేమమీద ఆధాపరపడి వుండును. ఒక వ్యక్తి తన పెంపుడు జంతువును అమితముగా ప్రేమించిన అతడు జంతువుగా జన్మించు అవకాశమున్నది. మన పురాణములలో జడ భరతుని కథ మనకు తెలిసినదే. అందువలన అనేకమైన పెంపుడు జంతువులను పెంచుకొనుచు, వాటి పెంపుదల కోసమే మన సమయమంతయు వెచ్చించుట తగదని చెబుతారు. అందులో కొన్ని చాలా మంచివి కావచ్చు. దానిలో సందేహము లేదు. కొన్ని మానవ జీవితము తరువాత అటువంటి జన్మ నెత్తి, మనతో మచ్చికగా మసులుతుండ వచ్చును. కాని అటువంటిది నీ లక్ష్యము కారాదు. ఆ విషయము వదలి తాను తిరిగి మానవ జన్మ స్థితికి రాకుండా వుండవలెనను వున్నతమైన లక్ష్యమును ఎరుకలో నుంచుకొని, ఉన్నత దశలకు వృద్ధిచెందు మానవునిగా పరిణతి చెందవలెనని ప్రయత్నము చేసినతని చైతన్యము గురుదేవులు స్వీకరించెదరు. అది ఈ జీవితమునకే పరిమితముగాక, దివ్యత్వములోని చివరి దశలను చేరువరకు వారి చేయూత మనకు లభించును. ఇది జీవిత కాలములోనే సాధ్యపడునా అని ప్రశ్నించవచ్చును. అంటే పరమాత్మలోని పరమాత్మునిగా దైవమును ఈ శరీరముతో నుండగనే తెలుసుకొనగలమా?

శ్రీ రామచంద్రజీ చెప్పిన ప్రకారము దివ్యత్వము యొక్క అనంతత్వ అనుభూతి ఈ శరీరముతో నుండగనే అనగా ఈ జీవితములోనే సాధ్యమగును. నీవు చేయు యోగసాధన సంపూర్ణ మైనదైనపుడు మరియు పరిచయ సమయములో ప్రాణాహుతి ప్రసారముతో చేయు దివ్యసంకల్పము అంతిమ లక్ష్యము దిశగా సాగుటకు చేసిన పరిశుద్ధ సంకల్ప మైనపుడు, అది నిన్ను తప్పకుండా అనంతత్వమునకు తీసుకొనిపోవలెను. అనంతమైన సత్యము తప్పక అనంతత్వమును చేరవలెను. ఇది సాధ్య మైన విషయమే. ఇది ఏవిధముగా సాధ్యమో మాలో కొందరిలో ప్రయోగాత్మకముగా చూపవలెననునది వారి ప్రయత్నములలో వొకటి. నా జీవితములో ఈ విషయము అనుభవ పూర్వకముగా చాలావరకు తెలుసుకొనునట్లు వారు చేసినారని, నమ్రతతో విన్నవించుకొనుచున్నాను. నేను ఏమీ ప్రత్యేకమైన వ్యక్తిని కాదు.

మనము అటువంటి పరిణతి పొందుటకు మన జీవితమును కైంకర్యము చేసుకొనినపుడు, మనమందరము దైవమునకు ప్రత్యేకమైన వారమే. "సాధకులు నాకు అవకాశము కలుగజేసినచో, వారు ఉన్నతగతులు చేరుటకు సేవ చేయుటకు నేను ఎల్లపుడు వేచి యుండెదను" అని వారు చెప్పినారు. ఈ విషయములు వారు రచించిన పుస్తకములలో వ్రాయబడినవి. ఇది వారి ఉద్దేశ్యమనీ నాకు తెలుసు. అనంతమునకు - దివ్యత్వమునకు తీసుకొనిపోవు అవకాశము కల్పించు సాధకుల కొరకు వారు పదేపదే ఎదురుచూస్తున్నారు. మానవ చైతన్యమునకు యిక్కడొక సవాలు వున్నది. ఆయన ఎంతో నమ్రతతో, నిశ్చయముగా యే అనుమానము లేకుండా మనముందుంచిన వారి ఉద్దేశ్యము సరియైనదని నేను చెప్పగలను. సాధకుడు తను ప్రేమించగలిగినంతవరకు, అది ఆయనకు మనపైగల ప్రేమకన్న చాల తక్కువైనను, తననుతాను వారికి అర్పించుకొన్నపుడు, ఈ శరీరములోనుండగనే మానవ చైతన్యము దైవచైతన్యముగా మార్పుచెందు అవకాశము కలదు. అపుడు యోగము రెండు విధములుగా పూర్తియగును. మొదటగా మీరు వారిని అంగీకరించి వారిలో లయమగుటకు, రెండవది మీ చైతన్యమును ఉన్నతస్థితులకు తీసుకొనిపోవుటకు వారు శ్రద్ధతో చేయు ప్రయత్నము. ఈ రెండు విషయములు ఏకకాలమందు జోడుగా పనిచేయుచు చివరికి అత్యుత్తమ ఫలితమునొసగును. ఇక్కడ సైద్ధాంతిక విషయముల అవసరము ఎక్కువగా లేదు. మీరు యివ్వవలసిన హామీలు ఏమనగా, మొట్టమొదటగా మీకు ఒక లక్ష్యముండవలెను. మీ చెంతనే వున్న దైవీ ప్రకృతి మరియు దివ్యస్థితి చేరుకొనుటకు యిష్టపడుతున్నారను కోరిక సుస్పష్టముగా నుండవలెను. రెండవది మిమ్ములను లక్ష్యము దిశగా తీసుకొనిపోయి ఆ చైతన్యములో కూడివుండుటకు మీకు మార్గదర్శకము చేయు వానిని, మొదటిలో అది ఎంతవరకు ప్రతిఫలకారియైనను, మీరు అంగీకరించవలెను. అతని సర్వవ్యాపక సామర్థ్యమును అనుభవపూర్వకముగా చూపించుచు మీరు అతని ఎదుటగా వున్నను లేకపోయినను అతను మిమ్ములను గమనించుచుండును. దూరము, సమయము లేదా పరిస్థితులు వారి ప్రాణాహుతి ప్రసార సామర్థ్యముపై ఏవిధమైన ప్రభావము చూపినట్లు అగుపించదు. ఇది వారి గురించి నా వినమ్రమైన అనుభవము. నా పనిలో చైతన్యముపై ఏవిధమైన ఆంక్షలను నేను గమనించలేదు. మూడవది, మిమ్ములను ఉన్నతగతులకు తీసుకొనిపోవు ఈ మార్గదర్శకుని దైవముగా మీరు తెలుసుకొనవలెను. అందువలననే వారు మిమ్ములను ఆ దివ్యత్వము వైపునకు కొనిపోగల సామర్థ్యము కలవారు. ముందుండి మిమ్ములను దైవము వద్దకు నడిపించగల సామర్థ్యము దైవమునకే కలదు. కాని ప్రారంభములో దీనిని మీ చైతన్యముపై బలవంతముగా రుద్దుటకు ప్రయత్నించరాదు. మీ మార్గదర్శి దైవము కావున మీరు వారిని దైవముగా పూజించవలెనని వెంటనే మీకుమీరు సంకల్పించరాదు. దయచేసి మీకు మార్గదర్శకము చేయువాడు మార్గదర్శి మాత్రమే. ఆయన దైవమే కావచ్చును. కాని అతనిని మార్గదర్శకునిగానే

ఉపయోగించుకొనుము. దైవముయొక్క ఆధిపత్యము, సర్వవ్యాపక సామర్థ్యము, వారి సృష్టీకరణ మొదలైన వాటి గురించి భయమును వీడి, అనుభవ పూర్వకమైన దృష్టికలిగి యుండినపుడు, మీకు దివ్యత్వముతో కూడిన స్నేహపూర్వకత, దివ్యత్వముతో చెలిమి, దివ్యత్వముతో సంబంధము కలిగియుండడము మీకు చాలా సులభమగును. ఏవిధమైన మూర్ఖపు అభిప్రాయములు లేదా సిద్ధాంతములను మీపై విధించరు. నీవు అనంతత్వమును కోరెదవా? నీకుగల ఒత్తిడినుండి బయటపడు ఉద్దేశ్యము కలదా? ఉన్నతమైన జీవన స్థితులకు పరిణామము చెందుటకు యిష్టపడెదవా? అనంతత్వమును అనుభవించు సాహసము చేయు సంకల్పము కలదా? ఈ ప్రశ్నలన్నిటికి అవునన్నది మీ సమాధానమైనచో అనంతత్వమును పొందుట మీకు చాలా సులభము.

ఇక్కడ మనము యితరులను విమర్శించు అవసరములేదు. ఎందుచేతననగా వారందరు ఒకవిధముగా మనలో కలిసి యున్నారు. కాని మనదైనందిక జీవితములోను, మన ఆచార వ్యవహారములలోను మన ఆలోచనాసరళి మరియు అలవాట్లు నిరాడంబరతను అంగీకరించుటకు అడ్డుపడుచున్నవి. నిరాడంబరత వాస్తవము కాదని, చౌకగా లభించునదేదియూ విలువైనది కాదని మనము అనుకొంటాము. నా గురుదేవులు నిరాడంబరునిగా, వుండుటకు యిష్టపడుతుంటారు. ఎవ్వరైనను వారి వద్దకు రావచ్చును. కాబట్టి ఏవిధమైన ఆంక్షలు విధించబడవు. నాకు తెలిసి వారు యితరులకు సేవచేయు ఆసక్తితో “ఈ విషయములేవీ మీ సేవచేయుటలో అడ్డుపడవు” అని చెబుతుంటారు. ఆయన సంపద మరియు సమయమును కూడ లెక్కచేయక, వారి సేవ కోరిన వారందరికి సహాయము చేయు యత్నము చేసినారు. అది వారి ఉదారతను చూపుటయేకాక, టాగూరు కవితలో చెప్పినట్లు, దైవము ఎక్కడైనను పనిచేయగలడనునది చూపు ఉద్దేశ్యము గోచరించును. గర్వముగల పండితుడు మాత్రమే ఏ ప్రదేశమునకైనా వెళ్లుటకు భయపడును. తాను పండితుని కాదని, అనుభవశాలినని భావించుట వలన, పూజ్య శ్రీ రామచంద్రజీ మహారాజ్ ప్రతి ఒక్కరికి అందుబాటులో కలరు. వీరిలోని ఈ ప్రత్యేక లక్షణము అనేకమందికి వీరిని అనంతమునకు చేర్చగల సమర్థునిగా అంగీకరించుటకు అడ్డు తగులుచున్నది. భారతావనిలోని మనము వివేకవంతులము కావున, క్లిష్టమైన వానికంటె అతి నిరాడంబరమైన వ్యక్తి సత్యమును అందజేయగల వానిగా చూడగలుగుచున్నాము.

నా స్వానుభవములో నా గురుదేవులు నా భావములోని నిరాడంబరతకన్న నిరాడంబరమైన వారు. అందువలననే నేను అర్థము చేసుకొనగలిగిన దానికంటె ఎక్కువ ప్రేమ భావన కలుగునట్లు చేయుచున్నారు. వారి ప్రేమ కూడా ఒక బంధనమగునేమోనని కొన్ని సందర్భములలో నేను

భయపడుతుండేవాడిని. మనలను వారి అనుబంధముతో కట్టివేయుటయే "బంధు" అను పదమునకు అర్థము. నన్ను వారు కట్టివేయు పద్ధతిలో, నా గురుదేవులను "బంధు" అనవచ్చునా అని ఆలోచించితిని. కాని మనలను హద్దులలో నుంచునవి కొన్ని బంధములైన, మనలను విముక్తులను చేయునవి కొన్ని వుండునని నేను తెలుసుకున్నాను. అన్ని బంధములు ఒకే తరగతికి చెందినవి కావు. ప్రతి విషయమునుండి నన్ను విముక్తిని చేయు మహానుభావుడు యిక్కడ వున్నారు. బంధమన్న భావన కలిగినచో నా మనసులోని ఉద్రిక్తతను యిట్టే తొలగించిన విధముగా, తొలగించగల సమర్థులు. ఇదొక వున్నతమైన దివ్యాను బంధము. దీనివలన విముక్తిద్వారా విముక్తులమగుదుమని, బంధనములవలన కాదని మనకు బోధపడును. పద్ధతి మరియు దాని అంతిమ ఫలితము ఒకే క్రమములో నుండవలెను. ముక్తి లేదా విముక్తి మాత్రమే విముక్తిని ప్రసాదించగలదు. దీనిని ప్రత్యేకమైన యోగముగా నేను నిర్వచించెదను. దైవము సంపూర్ణ మైన విముక్తియని, అందువలన నాకు విముక్తి కావలెనన్న, నేను అ దివ్యత్వమును తాకిన వెంటనే అది నాకు లభించునని నాకు బోధపడినది. వాస్తవమునకు వారు నన్ను తాకిన మరుక్షణమునుండి నాకు విముక్తి లభించుట ప్రారంభ మైనది. దాని పిదప విగ్రహములతోకాని లేదా భావములతోకాని, నాకు ఏవిధమైన బంధములు లేవు. నాకు వున్నది ఒకే ఒక్కటి - అదే విముక్తి. ఈ అత్యుత్తమమైన నిరాడంబరత ప్రపంచములోని ప్రతి వానికి వుండవలసిన అవసరమెంతైనా కలదని నేను భావించెదను. దీనివలన అతడు ఈ ప్రపంచమునకు స్వేచ్ఛను కలుగజేసి, దీనిలో నివసించు ప్రతిఒక్కరు వారియొక్క దివ్యత్వదశలో పూర్తిగా ఎదుగు అవకాశముగల ప్రదేశముగా చేయును.

అందరూ విముక్తు లై, శాంతియుతముగా కలిసివుండు స్వేచ్ఛా సందేశ మే మనకు కావలెను. ఈ మార్పు మొదట ఒక వ్య క్తిలో కలిగి, పిదప సమాజమంతటికీ సాధ్యమగును. దీనికి మన సత్సంగములలో మంచి పునాది వేయబడును. ఇక్కడ మనము సాధకులకు స్వేచ్ఛాయుత వాతావరణములో తగిన శిక్షణ యిచ్చెదము. ఈ పద్ధతిలోని సున్నితమైన సాధనలతో మతములోని యాంత్రికమయిన అనేక ఆచారములలో బంధింపబడిన మీకు వాస్తవమైన అర్థము లభించును. మనలో దివ్యత్వముతో కూడిన సహజత్వము అభివృద్ధి చెందును. దీనిలో అతి ఉన్నతస్థితులకు ఎదిగిన సాధకుడు దివ్యత్వమును పోలియుండవచ్చుననునది వాస్తవము. కాని అతి ఉన్నత స్థితులకు ఎదిగిన సాధకుడు దివ్యత్వమును పోలివుంటాడని మేము వూరకనే చెప్పము. దివ్యత్వముగా మారవచ్చునని మేము ఊరికే చెప్పము. అతను దివ్యత్వముగా ఖచ్చితముగా మారవచ్చును. దివ్యత్వముగా పరివర్తన చెందుట అనునది మనకు సహజము. అది పైనుండి వచ్చినదే కాని క్రిందనుండి బలవంతము చేయునది కాదు. అందుచేతనే సహజమార్గముగా పిలువబడు ఈ సాధనా విధానము దివ్యత్వముతోకూడిన సహజమైన

విధానము, అది మన యింద్రియములకు గోచరించనంత సహజమైనదిగా, నాకు, మాకందరికీ అనిపిస్తుంది. దీనిలో బాహ్యముగాకాని, మరియు కొన్ని సందర్భములలో గురుదేవులనుండి గాని మనపై బలవంతముగా విధించునవి ఏమియు లేవు. కాకపోతే ఈ విధానములో కొన్ని చేయకూడని, కొన్ని చేయవలసిన, “దశాదేశములు” ఉన్నవి. కానీ మీరు వాటిని నిశితముగా పరిశీలించినచో అవి అన్నియు దివ్యత్వముతో కూడిన జీవితము గడుపు వారందరు సహజముగా ఆచరించునవియే. ఈ దశాదేశములను మీ ముందుంచుకొనవలసిన పనిలేదు. అవి సహజముగా, క్రమేణా మీ జీవితములో సంభవించునవి.

మీలోకి ప్రవేశ పెట్టబడిన చైతన్యము, మీలోని ప్రతి అణువులోను కలసిపోవుటచేత, మీరు చేయు ప్రతిపని దైవచింతనతో చేయుట సహజమైపోవును. ఎందుచేతననగా అది మీ హృదయములోనికి ప్రవేశపెట్టబడినది. మనకిచ్చిన సాధనక్రమము సరళము, సహజము, సరళముగానుండి సహజత్వముతో మనలో మార్పు కలుగజేయుచు చివరకు దివ్యత్వమునకు చేర్చును. ఇటువంటి యోగసాధనను ఈ సంస్థ వ్యవస్థాపకులైన శ్రీ రామచంద్రజీ మహారాజ్ గారు, వారి గురుదేవులు, ఫతేఘర్ వాస్తవ్యులైన పూజ్య శ్రీ రామచంద్రజీ మహారాజ్, పూజ్యలాలాజీ మహారాజ్‌గా వ్యవహరింపబడు, వారి దివ్య ఉపదేశమునుసరించి మనకందించినందులకు వారికి ఎల్లవేళలా మనము ఋణపడి వుండవలెను. ఈ యోగమార్గములో ఈ యోగశిక్షణలో మనలో అనేకమందికి మానసిక, ప్రాణశరీర సమస్యలలో సహాయము చేయుచున్న ఈ యిద్దరు మహానుభావులకు మనము ఎంతో ఋణపడి వున్నాము. ఇటువంటి సమస్యలకు ఈ విధానము తక్షణ పరిష్కారము చూపును అని తెలియుచున్నది. మానసిక రోగగ్రస్థులకు వైద్యపరమైనదిగాకూడ పనిచేసి, ఎంతో మార్పు తీసుకొని వచ్చి దాని విశిష్టతను చాటుచున్నది. అందువలన ఈ పద్ధతిలోని సాధనావిధానముల వలన మానవ భవిష్యత్ జీవనములో దివ్యత్వము కలుగునని నేను నమ్మకముతో ఖచ్చితముగా చెప్పగలను. ఈ విధముగా మానవుని ఆత్మను దివ్యత్వమునకు ఎదుగునటుల చేయుసేవ ఉన్నతమైనది. ఇతరవిధములైన సేవలు మంచివి కావచ్చును. మానవునిలోని దివ్యత్వము లేదా అతడు దివ్యత్వమునకు అభివృద్ధిచెందగల అవకాశమును అతని ఎరుకలోనికి తెచ్చుటయే అతి ఉన్నతమైన సేవగా గుర్తించబడినది. కాని ఈ సిద్ధాంతమును యితరులకు తెలియజెప్పుట బహుకష్టమైనదిగా భావించుటవలన, శారీరకసేవ మొదట చేసి తద్వారా ఆత్మకు తెలియజెప్పుట ఉత్తమమని భావించినారు. కొన్ని సందర్భములలో గుర్రము ముందు బండిని వుంచినట్లుగా యిది జరుగును. అన్ని సందర్భములలో కాకపోయినా, కొన్ని సందర్భములలో యిటుల జరుగును. ఈ వ్యతిరేకత సంభవించకుండుటకు, ప్రాణాహుతి ప్రసారము చేయుటకు అవకాశము యివ్వబడిన సాధకులు, అభిలాషతో మానవసేవ చేయుటకు కృతనిశ్చయము

కలిగియుండవలెను. మానవుని దివ్యస్వభావునిగా మార్చుటకు వారు చేయగలిగిన ప్రయత్నములన్నీ చేయవలెను. ఇది ఈ సంస్థలోని శిక్షకులకు యిచ్చు సూచన. వారి ముందున్న ప్రధానమైన కార్యమునుండి దృష్టి మరల్చవలదని మరియు అభ్యాసులు వారికి శిక్షకులనుండి లభించు దివ్యత్వ సేవలను పొందుచు, వారితో సహకరించవలసినదిగా కోరుచున్నాను. దీనివలన మనము వాస్తవముగా పునరుజ్జీవులమగుటకు తోడ్పడును. నేను దీనిని విప్లవాత్మకమైనదిగా చెప్పను. ఎందువలననగా ఈ మాటకు యిప్పటి పరిస్థితులలో వేరు అర్థము స్ఫురించును. నేను దానిని పునరుజ్జీవనము లేదా తిరిగి యధాస్థితికి తీసుకొనివచ్చుట యనిచెప్పెదను. లేదా దివ్యత్వమును ప్రతి స్త్రీ పురుషుల మరియు పిల్లల హృదయములలో ఆసీనులను చేసి పట్టము కట్టుటగా చెప్పెదను.

ఇది విశిష్టమైన గమ్యము. నేను యిటువంటి కార్యములో పాలు పంచుకొనుచుండుటకు చాలా గర్విస్తున్నాను. ఈ పనిని పూజ్య గురుదేవులకు నేను చేయుచునేయుండెదను.

(పూజ్య శ్రీ డాక్టర్ కె.సి. వరదాచారి గారి Complete Works of Dr.K.C.Varadachari Vol.I యందు ఆంగ్లములోని "The Service of Man"కు యిది తెలుగు లో స్వేచ్ఛానువాదము. పాఠకులు మరింత అవగాహనకు లేదా సందేహ నివృత్తికి ఆంగ్ల రచనయే ప్రామాణాకముగా తీసుకొనవలసినదిగా మనవి చేసుకొనుచున్నాను. - రామం)